## అజాగ్రత్తగా ఉంటే ఉపేక్షించం..

- భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి
- ప్రతీ రోజు కలెక్టర్ల కార్యాచరణ పంపాలి..
- రాష్ట్రంలో కావాల్సినంత యూరియా ఉంది..
- పోలీస్ ఉన్నతాధికారులు గ్రౌండ్ స్థాయిలో ఉండాలి
- కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష




# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

మంగళవారం | 22 జూలై 2025 | 12 పేజీలు




12

## టైగర్ జోన్‌పై అడవి బిడ్డల విజయం

- ఆదివాసీల ఆందోళనతో దిగొచ్చిన ప్రభుత్వం
- జీవో 49ని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆదివాసీ సంఘాల నేతలు..
- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఉమ్మడి జిల్లా ప్రతినిధులు



■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

కుమ్రంభీం జిల్లా టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ని సోమవారం నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. పులుల కారిడార్, కవ్వాల్ అభయారణ్యంలో భాగంగా ఉన్న ఆసిఫాబాద్ ప్రాంతాన్ని కుమరంభీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటిస్తూ గతనెల 30 అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం జీవో49 జారీ చేశారు. ఈ జీవో ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కర్జెల్లి, బెజ్జూరు, పెంచికల్‌పేట రేంజ్‌ల పరిధిలో 1,49,288 హెక్టార్లను టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జీవో విడుదలైన రోజు నుంచి దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ సంఘాలు ఆందోళనలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కుమరంభీం జిల్లా టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ని సోమవారం నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. జీవో 49 రద్దు చేయడం హర్షణీయమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు అన్నారు.



12

## నిర్మల్ సిగలో మరో మణిహారం

- నిర్మల్ కళ్యాణి జాతీయ రహదారి నాలుగు లైన్ల విస్తరణ
- 53 కిలోమీటర్ల విస్తరణకు డీపీఆర్ తయారు..
- కేంద్రం పచ్చ జెండాతో నిర్మల్ జిల్లా వాసుల హర్షం
- మహారాష్ట్రతో పాటు వివిధ జిల్లాలకు అనుసంధానం
- రోడ్డు విస్తర్ణతో తీరనున్న ట్రాఫిక్ సమస్య..
- ఫోర్ లైన్ విస్తరణతో మరింత అభివృద్ధికి అవకాశం..

చారిత్రాత్మక నగరిగా పేరు ప్రఖ్యాతలు పొందిన నిర్మల్ జిల్లాకు మరో జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం పచ్చ జెండా ఊపింది. నిర్మల్ కళ్యాణి ఎన్ హెచ్ 61 జాతీయ రహదారి విస్తరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నిర్మల్ జిల్లాలో రహదారి అభివృద్ధి పనులు విస్తరణ జరిగే అవకాశం ఉండడంతో నిర్మల్ బైంసా బాసర్ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని 15 జాతీయ రహదారుల అభివృద్ధి విస్తరణకు కేంద్ర రహదారుల సంస్థ 33 691 కోట్లను కేటాయించగా అందులో నిర్మల్ కళ్యాణి రహదారి ఉండడంతో ఇక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ పట్టణ కేంద్రంగా ఇప్పటికీ హైదరాబాద్-నాగపూర్ జాతీయ రహదారి 64 ఉండగా, నిర్మల్ ఖానాపూర్ జగిత్యాల్ జాతీయ రహదారి విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి.



7

## విద్యార్థులు పెరిగారు టీచర్లు తగ్గారు

- తాళ్లపేట పాఠశాల టీచర్ల కృషితో పెరిగిన సంఖ్య
- పాఠశాలలో 36 నుంచి 90కు చేరిన విద్యార్థుల సంఖ్య
- బడిని బతికించిన టీచర్లకు గ్రామస్తుల అభినందనలు
- ఐదు తరగతులకు పాఠాలు బోధిస్తున్నది ముగ్గురే..
- సరిపడా సిబ్బందిని కేటాయించాలంటున్న స్థానికులు

తాళ్లపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కృషితో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి మరీ 50కి పైగా అడ్మిషన్లు చేయించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. విద్యా సంవత్సరం ప్రారం భంలో 36 మంది మాత్రమే ఉండగా, ప్రస్తుతం 90 మంది తో స్కూల్ కళకళలాడుతున్నది. ఇక ప్రస్తుతం ముగ్గురే ఉపా ధ్యాయులుండగా, విద్యార్థుల సంఖ్యకనుగుణంగా సిబ్బందిని కేటాయించాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రభాకర్, గ్రామస్తులు కోరుతున్నారు.

## శిక్షణలోనే తనువు చాలించిన జవాన్

- అస్సాంలో ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం వర్తమన్నూర్ గ్రామానికి చెదిన అకాష్..
- రన్నింగ్ చేస్తూ కుప్ప కూలిన యువ జవాన్ - 11లో



12

## థ్యాంకూ సార్!

రాష్ట్ర ప్రభుత్వం జీవో 49 ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని, ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీవోను నిలిపివేసినందుకు ఆదివాసీల పక్షాన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఉమ్మడి జిల్లాలో బంద్ ప్రశాంతం

- జీవో 49కు వ్యతిరేకంగా ఆదివాసీ సంఘాల పిలుపు
- బంద్‌కు మద్దతు తెలిపిన వివిధ సంఘాలు

జీవో 49కు వ్యతిరేకంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం తలపెట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఉదయం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్క దుకాణం కూడా తెరచుకోలేదు. బస్సులు కూడా ఆయా డిపోలకే పరిమితమయ్యాయి.






# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి
- ప్రతీ రోజు కలెక్టర్ల కార్యాచరణ పంపాలి..
- కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

**మంచిర్యాల, జూలై 21 (ప్రభాత సమాచారం)**
ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఖమ్మం జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేకానంద, దామోదర రాజనర్సింహ, దుద్దిల్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ (సీతక్క), వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వర్షాకాలం అయినందున జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తాగునీటి ప్రాజెక్టులు, చెరువులలో నీటి నిల్వలు స్థాయి- వినియోగం, వానాకాలం సీజన్ లో వ్యవసాయ సాగు, యూరియా నిల్వలు, ఎరువులు కొరత లేకుండా సమకూర్చడం, ప్రతి ఫర్టిలైజర్ షాపును తనిఖీలు చేపట్టి ఆయా షాపులలో ఉన్న నిల్వలు, నోటీస్ బోర్డులపై ఉంచిన వివరాల పరిశీలన చేసి పక్కదారి పట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జన జీవనానికి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్, రహదారులు తెగిపోకుండా తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూన్ నెల నుండి ఇప్పటివరకు వర్షపాతం తక్కువగా నమోదైనప్పటికీ గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని, వాతావరణ సూచనలకు అనుగుణంగా జిల్లాలలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, జిల్లాలలో పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. గిరిజనులు అంటూ వ్యాధుల బారిన పడకుండా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు అందుబాటులో ఉండాలని తెలిపారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలని, పశువులకు ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుత నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు కలెక్టర్ల కార్యచరణకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో నివేదికను అందించాలని తెలిపారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటికి సంబంధించి నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు. యూరియా స్టాక్ కు సంబంధించి ప్రతి ఎరువుల షాపు వద్ద స్టాక్ వివరాలు తెలిసేలా బోర్డుపై ప్రదర్శించాలని, ఆన్ లైన్ లో నమోదు చేయాలని, ఎరువుల కొరత ఉన్నట్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, ఈ విషయంపై తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలిపారు. యూరియా కావలసినంత అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఇతర వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, రైతు సంక్షేమమే అన్నిటికన్నా ముఖ్యమని తెలిపారు. ఎరువులకు సంబంధించి ఫిర్యాదుల కొరకు ప్రతి జిల్లాలో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 96 లక్షల 95 వేల 299 రేషన్ కార్డులు ఉన్నాయని, ఈ కార్డుల ద్వారా దాదాపు 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. గతంలో చౌక ధరల దుకాణాలపై ప్రజలకు ఆసక్తి ఉండేది కాదని, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో రేషన్ కార్డు, చౌక ధరల దుకాణం విలువ పెరిగిందని, 3 నెలల సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల 25 నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలలో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, శాసన సభ్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రులు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని, జిల్లా కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ తగు చర్యలు తీసుకోవాలని, ప్రతి మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్




వ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది ఖాళీలను పరిశీలించి అవసరమైన మేరకు నియామకంతో పాటు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, గిరిజన ప్రాంతాలలో అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని, డెంగ్యూ, మలేరియా ఇతర జ్వరాలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేసే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పంపిణీ చేసే ప్రాంతాలతో కార్యచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో వర్షాల కారణంగా ఏర్పడే వరద పరిస్థితులలో ప్రజల సహాయార్థం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736- 250501 ఏర్పాటు చేసి ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయడం జరిగిందని, వర్షాకాల పరిస్థితులలో అధికారులందరూ అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బట్వాన్‌పల్లిలో పోలీస్ కమ్యూనిటీ ప్రోగ్రాం

- గుడుంబాతో జీవితాలు నాశనం..!
- బెల్లంపల్లి రూరల్ సీఐ అనూక్



**బెల్లంపల్లి, జూలై 21 (ప్రభాత సమాచారం)**
ప్రజలు జీవనాధారం కోసం గుడుంబా ఇతర మాదకద్రవ్యాలను ఆశ్రయిస్తే జీవితాలు నాశనం అవుతాయని బెల్లంపల్లి రూరల్ సిఐ అనుక్ అన్నారు. బెల్లంపల్లి మండలం బట్వానపల్లి గ్రామంలో సోమవారం పోలీసులు, అబ్కారి శాఖ కలసి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా బట్వానపల్లి గ్రామంలో 31 టూ వీలర్లు,3 ఆటోలు,15 లీటర్ల గుడుంబా నాయిని లచ్చయ్య, దల్యా మల్వోతూ నుంచి లభించినగా సీజ్ చేసినట్లు చెప్పారు. అదే విధంగా ఈ తనిఖీలో దొరికిన 200 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ అనుక్ మాట్లాడుతూ గుడుంబాను ఎవరూ తయారు చేయోద్దనీ, తాగోద్దన్నారు. దానివల్ల ఆరోగ్యం నాశనం అవుతుందని చెప్పారు. అంతేకాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితులు దిగజగడం జరుగుతోందనీ, పిల్లలు చదువు కోకుండా సమాజంలో పనికిరాని వారు అవుతారన్నారు. అలాగే గంజాయిని ఎవరూ సేవించడం, అమ్మడం, ట్రాన్స్పోర్ట్ చేయడం చట్ట రీత్య నేరమన్నారు. యువత మత్తు పదార్థాలు బానిస అవ్వడం సమాజానికి ప్రమాదం అన్నారు. తల్లి దండ్రులు కొడుకుల ప్రవర్తనను గమనించిన వారిలో చెడు అలవాట్లకి దూరంగా ఉండేలాచూడాలన్నారు. వాహనాలకు అన్నిరకాల డాక్యుమెంట్స్ ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురజాల ఎస్సై రమేష్, కన్నెపల్లి ఎస్సై భాస్కర్, భీమిని ఎస్ఐ విజయ్, బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్సై రాకేష్, ఏఎస్సై లు, హెచ్‌సీలు, కానిస్టేబుల్ పాల్గొన్నారు.



# తాళం వేసిన ఇంట్లో చోరీ

**ముథోల్, జూలై 21 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రమైన ముథోల్‌లోని సాయి మాధవ్‌నగర్ కాలనీలో సోమవారం మధ్యాహ్న సమయంలో సాయినాథ్ కు చెందిన ఇంట్లో దొంగతనం జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం బాధితుడు సాయినాథ్ తనఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం వేరే గ్రామానికి వెళ్లాడు. అయితే మధ్యాహ్నం వేళలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును దొంగలించారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చిన బాధితుడు కుటుంబ సభ్యులు చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో దొంగతనం జరిగినట్లు విషయాన్ని వెంటనే గ్రహించి ముథోల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ సిఐ మల్లేష్, ఎస్సై బిట్ల పెర్సెస్ లు హుటాహుటిన సంఘటన జరిగిన ఇంటిని పరిశీలించారు. పలు వివరాలను బాధితుడు నుండి అడిగి తెలుసుకున్నారు. బంగారు గొలుసు విలువ సుమారు.రూ.2లక్ష ల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# జీవో 49తో ఆదివాసీలకు నష్టం

**జన్నారం, జూలై 21 (ప్రభాత సమాచారం)**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీవో నంబర్ 49తో ఆదివాసీలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆదివాసీ సంఘం మంచిర్యాల జిల్లా నాయకులు నాగేశ్వర్, యశ్వంత్, రాయి సెండం కాళీ అన్నారు. ఉమ్మడి జిల్లా బంద్‌లో భాగంగా సోమవారం జన్నారంలో దుకాణాలను మూసివేయించారు. కార్యక్రమంలో కేంద్రం రాజేశ్వర్ బజ్జు దువ్వ యశ్వంతరావు, జ్ఞానేశ్వర్ గంగు, తుమ్మరం లక్ష్మణ్ ఆనందరావు పాల్గొన్నారు.



# జీవో 49ని రద్దు చేయాలి

**జన్నారం, జూలై 21 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడ బలుక్కొని మే 30న జీవో నెంబర్ 49 ని తీసుకువచ్చి ఆదివాసులకు తీరని అన్యాయం చేస్తుందని, ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎం) జన్నారం మండల కార్యదర్శి కనికరం అశోక్ అన్నారు. సోమవారం ఆదివాసి గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జీవో రద్దు చేయాలని నిర్వహిస్తున్న బందుకు సంపూర్ణ మద్దతు పలికారు. అనంతరం 49 జీవో ప్రతులను కాల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ల్‌లో రావటంతో అభివృద్ధికి ఆటంకం అవుతుందని, ఆదివాసుల అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా ఈ జీవో ఉన్నదన్నారు. ఈ జీవో రద్దు కోసం ఆదివాసి సంఘాల జేఏసీ పిలుపు బందులో భాగంగా పాల్గొని సంపూర్ణ మద్దతు పలికామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ నాయకులు కొండగుర్ల లింగన్న,అంబటి లక్ష్మణ్, ఎస్కే అబ్దుల్లా, కూకట్ కారు బుచ్చయ్య, ఒడిపల్లి ప్రమీల,చంద్రమొగిలి, కోరుట్ల యశోద, ఆత్రం రవి, గుడ్ల రాజన్న, మల్లయ్య పాల్గొన్నారు.





## వర్షాకాలం కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు
# పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

### వీడియోకాన్ఫరెన్సులో కలెక్టర్లను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**నిర్మల్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

సోమవారం హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు మంత్రులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫ రెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్షాకాలం కాలానుగుణ వ్యాధుల నియంత్రణ, వర దల నష్ట నివారణ చర్యలు, వ్యవసాయం, సాగునీరు, నూ తన రేషన్ కార్డుల పంపిణీ, తదితర అంశాలపై కలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమా వేశంలో భాగంగా సీఎం మాట్లాడుతూ, వర్షాకాలం కాలాను గుణ వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున దోమల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్యులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అధిక వర్షాల వల్ల సంభవించే వరదల నష్టాలు నివారించేందుకు అధికారులు తగు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. వరదల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం కలుగకూడదన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు అన్ని జిల్లాలలో కలెక్టర్లు, జిల్లల ఇన్చార్జి మంత్రులు, శాసనస భ్యులు ప్రజలకు రేషన్ కార్డులను అందించాలన్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో ఆకస్మిక పర్యటనలు చేస్తూ ఉండాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి అధికారులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మా ట్లాడుతూ, వర్షాకాలం కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం దోమలు, దోమల లార్వాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మెరుగైన పారిశుద్ధ్య పనులు నిర్వహించడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చునని తెలిపారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులతో పాటు, అవసరమైన మందులన్నీ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో నిరంతరం మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహించాలన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి జిల్లాలో మండలాల వారీగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను చేపట్టేందుకు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారుల సమన్వయంతో రైతులకు పంటలకు అవసరమయ్యే సాగునీరును అందించాలని పేర్కొన్నారు. రైతులందరికీ సరిపడినంత యూరియా, డిఏపి, ఇతర ఎరువులను అందించాలని తెలిపారు. అన్ని ఎరువులు, మందుల దుకాణాలలో అందుబాటులో ఉన్న ఎరువులకు సంబంధించి



వివరాలను ప్రదర్శించాలన్నారు. ఎరువులు పక్కదారి పడితే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. అధిక వర్షాల వల్ల అకాల వర్షాలు సంభవిస్తే వరద నష్టాలను నివారించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉం డాలన్నారు. ఇప్పటికే జిల్లాలో విపత్తు నిర్వహణ బృందాలు (ఎన్డీఆర్ఎఫ్) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిపిఓ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, డిఎంహెచ్ఓ రాజేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## ఓబీసీ 10వ జాతీయ మహా సభలను
# విజయవంతం చేయాలి

**మందమర్రి, జూలై 21 (ప్రభాత సమాచారం)**

ఆగస్టు 7న గోవాలో జరిగే ఓబీసీ 10వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిల్ల శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షులు ముడారపు శేఖర్ లు కోరారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం చలో గోవా పోస్టర్లను ఆవిష్కరించి వారు మాట్లాడారు. మేమెంతో.. మాకంత.. అనే నినాదంతో హక్కుల కోసం పోరాడి విజయాలు సాధించుకుం టున్నామని అన్నారు. పాలితులుగా ఉన్నవాళ్ళం నేడు పాలకులం కావాలి అనే ఎజెండాతో పోరాడి అంతి మంగా రాజకీయ అధికారాన్ని సాధించి బీసీల ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పాలని వారు కోరారు. ఈ కార్య క్రమంలో జాతీయ బీసీ సంక్షేమ నాయకులు తడి గొప్పుల రవిరాజా, జాడ క్రాంతి కుమార్, చెప్పాల రమేష్, కలీం, యోగానంద రావు, సంపత్, కలీల్, ఎర్రన్న, యాదగిరి, చింతల రమేష్, యూత్ నాయ కులు గరిగె సుమన్, ముప్కె అఖిల్, శ్రావణ్, అర్కటి రవీందర్, అనిల్, ఒమేశ్వర్‌లు పాల్గొన్నారు.

# బీరవెల్లి బుద్ధుని విగ్రహం ఆవిష్కరణ

**సారంగాపూర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

సారంగాపూర్ మండలం బీరవెల్లి గ్రామంలో మాల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్, బిఎస్ఐ జిల్లా ట్రెజరీ సేపూరి సిద్ధార్థ, మాల సంఘం జిల్లా ట్రెసరీ రొడ్డ గంగన్న, సలహాదారుడు రాజేశ్వర్, విగ్రహా విష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, ప్రపంచానికే శాంతి మార్గాన్ని చూపెట్టింది గౌతమ బుద్ధుడు అని అంబేద్కర్ తన చివరి రోజులలో బౌద్ధ మతాన్ని



స్వీకరించాడన్నారు. సోమవారం రోజు బీరవేల్లి గ్రామంలో మాల సంఘ సభ్యులు అందరూ కలిసి గౌతమ బుద్ధుడి విగ్ర హాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

# విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉంది



**మంచిర్యాల, జూలై 21 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినిలు అస్వస్థతకు గురికావడంతో వారిని ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నామని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న బి. తరుణి (8వ తరగతి) జ్వరంతో, బి. రేవతి (6వ తరగతి) టాన్సిలైటిస్ తో కూడిన జ్వరంతో బాధపడుతుండగా మాతా శిశు ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలి పారు. విద్యార్థినిలు ఇద్దరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, మీడియా ప్రతినిధులు సందర్శించినప్పుడు వైద్యులు ఈ విషయాన్ని నిర్ధారించారని, చికిత్స కొనసాగుతుందని, ఎ.టి.డి.ఓ., పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి వెంట ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై కొంత మంది కలుషిత ఆహారం తినడం వల్ల ఇలా జరిగిందని అవాస్తవాలు ప్రచారం చేసి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి అవాస్తవ, అనాలోచిత చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



# 'డీఈవోపై చర్యలు తీసుకోవాలి'

**జన్నారం, జూలై 21 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు పాలదర్శకంగా నిర్వహించాలని ఉద్దేశంతో జారీ చేసిన సర్దుబాటు ఉత్త ర్వులను అతిక్రమించి తన ఇష్టానుసారంగా ఉపా ధ్యాయుల సర్దుబాటు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మని, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్ అన్నారు. సోమవారం విల ేకరులతో మాట్లాడారు. విద్యార్థుల కంటే ఉపాధ్యాయుల ప్రయోజనాలనే దృష్టిలో పెట్టుకొని సర్దుబాటును చేసినట్లు ఈ ఉపాధ్యాయ సర్దుబాట్లు ఉన్నాయన్నారు.. కొన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న కూడా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయకపోవడం విస్మయానికి గురిచేస్తుందన్నారు. జన్నారం మండలంలోని అత్యధిక విద్యార్థులు ఉన్న ప్రా థమిక కొన్నత పాఠశాలలు రేండ్లగూడ, ఇంధన్‌పెల్లి, ధర్మారం పాఠశాలలో స్కూల్ ఉపాధ్యాయులు, భాష ఉపాధ్యాయులు పక్క మండలాల్లో మిగులు ఉపాధ్యా యులు ఉన్నా కూడా సర్దుబాటు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. సర్దుబాటు ఉత్తరువు సంఖ్య 25 ప్రకారం మిగులు ఉపాధ్యాయులు పనిచ స్తున్న మండలాలలోనే ఖాళీ లేకుంటే పక్క మండలాలలో లేకుంటే జిల్లాలో ఎక్కడైనా సర్దుబాటు చేయాలనే ఉత్తర్వులున్నాయని, కానీ మంచిర్యాల జిల్లా విద్యాధికారి సర్దుబాటు ఉత్తర్వులను పక్కన పెట్టి మండలంలో మిగులు ఉపాధ్యాయులు ఉన్నా కూడా దూర ప్రాంతంలో నుండి ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం లో అనేక అక్రమాలు చేస్తున్నాడన్నారు. లక్షెట్టిపేట మండలం పక్క మండలమైన దండేపల్లిలో అదనపు ఉపాధ్యాయులు ఉన్నా కూడా కోటపల్లి నుండి స్కూల్ అసిస్టెంట్ ను నుండి కేటాయించారు. ఇదే మాదిరిగా చెన్నూరు నుండి మందమర్రికి, మండలంలో మిగులు ఉపాధ్యాయులు ఉండగా పక్క మండలం మండలం నుండి లక్షట్ పేట్ మండలంకి చెన్నూరు మండలం నుండి మందమర్రి మండలానికి తాండూర్ మండలం నుండి మంచిరాల మండలానికి రేచిని నుండి మంచిర్యాల మండలానికి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ, నిబంధనలు అతిక్రమించి ఉన్నతా ధికారాలను తప్పుదోవ పట్టించి సర్దుబాటు ప్రక్రియను నిర్వహించిన జిల్లా విద్యాశాఖ అధికారి పై శాఖ పరమ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆమ్ ఆద్మీ పార్టీపై విమర్శలు ఖండించిన ఆప్ నేతలు

**నిర్మల్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై చేసిన వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా తీవ్రంగా ఖండిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి జూలై 21వ తేదీలోగా క్షమాపణలు చెప్పి, తన వ్యాఖ్యలను ఉపసంహరిం చుకోవాలని సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక హామీలు ఇచ్చే అధికారం వచ్చిన తర్వాత ఏ సమస్య కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించడం చేయడం కాదు కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన తర్వాత అనేక సందర్భాల్లో సంక్షేమ వసతి గృహాలలో ఫుడ్ పాయిజన్ అయింది అని అన్నారు ఒకసారి కూడా మాట్లాడడం చేతకాదు అని అన్నారు. పెన్షన్లు పెంచుతామని అన్నారు కానీ ఎక్కడ కూడా పెంచలేదు అని అన్నారు. ఢిల్లీ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జూలై 22వ తేదీన జూబ్లీ హిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కార్యకర్తలు ముట్టడిస్తారని ఆయన హెచ్చరించారు.



# మూఢనమ్మకాల భ్రమలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

**డబ్బులు పోయాయని తోటి విద్యార్థులకు పసుపు బియ్యం తినిపించిన వైనం**

**తినగానే వాంతులు కడుపునొప్పితో ఆస్పత్రి పాలైన విద్యార్థులు - పెంబి మండల కేంద్రంలో జరిగిన దుర్ఘటన**



**ఖానాపూర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా పెంబి మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పసుపు బియ్యం తిని విద్యార్థినిలు ఆసుపత్రి పాలైన సంఘటన జిల్లాలో కలకలం రేపింది. కంప్యూటర్ యుగంలో కూడా మూఢనమ్మకాలు పాటిస్తున్నారంటే వారు ఎంత వెనుకబడి ఉన్నారో అర్థమవుతుంది. వివరాల్లోకి వెళితే పెంబి మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినిల బాక్సుల నుండి అదే పాఠశాలలోని వేరే విద్యార్థులు డబ్బులు దొంగిలించినారు. డబ్బులు పోగొట్టుకున్న విద్యార్థులు తోటి విద్యార్థులను డబ్బుల గురించి ఎంత అడిగినా ఎవరు ఏం చెప్పలేదు. నేను తీయలేదు అంటే నేను తీయలేదు అని జవాబు ఇచ్చినారు. ఈ నేపథ్యంలో డబ్బులు పోగొట్టుకున్న బాలికలు తోటి విద్యార్థినిలకు పసుపు బియ్యం, వేపాకు తినిపించారు. ఇవి తిన్న వెంటనే విద్యార్థినిలకు వాంతులు కావడం, కడుపునొప్పి రావడంతో వారిని హుటాహుటిన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయించినారు. చికిత్స అనంతరం తిరిగి వారిని ఆశ్రమ పాఠశాలకు తరలించినారు. పిల్లలను చూడడానికి తల్లిదండ్రులు వెళితే వారిని లోపలికి అనుమతించక పోవడంతో వారు ఆవేదన చెందినారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థి సంఘాలు హెచ్చరించినాయి. పల్లెల్లో నివసించే ప్రజలకు మూఢనమ్మకాలు ఎక్కువగా ఉంటాయని, వారి మూఢనమ్మకాలు తొలగించడానికి నిరంతరం జన విజ్ఞాన వేదిక లాంటి శాస్త్రీయ దృక్పథం కలిగిన ఆర్గనైజేషన్ తో మూఢనమ్మకాల నివారణ కొరకు కార్యక్రమాలు నిర్వహించాలని మేధావులు అంటున్నారు.

## జీవో 49 రద్దు చేయాలని కాసిపేటలో ఆదివాసీల ధర్నా

**కాసిపేట, జూలై 21 (ప్రభాత సమాచారం)**
కాసిపేటలో జీవో నెంబర్ 49 ని వెంటనే రద్దు చేయాలనీ ఆదివాసీలు ఆందోళనకు దిగారు. సోమవారం 49 జీవోను రద్దు చేయాలని తలపెట్టిన బంద్‌ను పురస్కరించుకొని కాసిపేట ప్రధాన రహదారిపై ఆదివాసీలు బైఠాయించారు. అటవీ ఖనిజ సంపదను దోచుకోవాలనే ఉదేశ్యంతో టైగర్ రిజర్వ్ పేరుతో ఆదివాసుల హక్కులను హరించేందుకు 49 జీవం తెచ్చారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన 49 జీవో మాకొద్దని ఆదివాసీలు గర్జించారు. ఇప్పటికైనా జీవో 49ను రద్దు చేయాలనీ ఆదివాసీలు డిమాండ్ చేశారు. 49 జీవో రద్దు కోసం ప్రజా ఉద్యమాన్ని హెచ్చరించారు. అందుకోసం పాలకుల ఇళ్ళు, ప్రభుత్వ, కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.



## బెజ్జూర్‌లో ఆదివాసీల ఆందోళన



**బెజ్జూర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండల కేంద్రంలో జీవో నెంబర్ 49 రద్దు చేయాలని సోమవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రంలో బస్టాండ్ ఏరియాలో ఆదివాసీలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. బెజ్జూరు మండల కేంద్రంలో వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా బందు పాటించాయి. జీవో నెంబర్ 49 రద్దు చేయాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. ఆదివాసి సంఘాల సంఘాలకు బిజెపి నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ మండల ఆదివాసి సంఘం అధ్యక్షులు కోరత తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## భద్రత ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ

**మందమర్రి, జూలై 21 (ప్రభాత సమాచారం)**
సింగరేణి కార్మికులు భద్రత ప్రమాణాలు పాటిస్తూ స్వీయ రక్షణతో విధులు నిర్వహించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘుకుమార్, ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ విజయ్ ప్రసాద్‌లు అన్నారు. పట్టణంలోని స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం ఈపి ఆపరేటర్స్, ఎంవి డ్రైవర్లకు రెండు రోజుల సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అమలుపై శిక్షణ కార్యక్రమం, రక్షణ అంతర్గత విభాగంచే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈపి ఆపరేటర్స్, ఎంవి డ్రైవర్స్ భద్రత ప్రమాణాలు పాటిస్తూ, జాగ్రత్తగా విధులు నిర్వహించాలని, గనులలో ప్రమాదాల నివారణకు సిఎంఆర్ 2017లో నిర్దేశించిన రెగ్యులేషన్ ప్రకారం సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అమలు పరచడం, ఎస్ఎంపి పాటించాలని, ఏమైనా లోటుపాట్లు ఉంటే సంబంధిత సూపర్వైజర్లు, అధికారుల




దృష్టికి తీసుకువచ్చి భద్రత చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారించాలన్నారు. సింగరేణిలో రక్షణ పెంపొందించడానికి యాజమాన్యం తన వంతు బాధ్యతగా శిక్షణ కార్యక్రమాలు చేపడుతుందని వారు గుర్తు చేశారు. ఈపీ ఆపరేటర్స్, ఎంవి డ్రైవర్స్ రక్షణ చర్యలను పూర్తిగా అవగాహన చేసుకోని ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్ది సంస్థ లక్ష్యాన్ని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూశంకరయ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.



## ఖర్గేను కలిసిన మంత్రి వివేక్,ఎంపీ వంశీ

**మంచిర్యాల, జూలై 21 (ప్రభాత సమాచారం)**
ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేని సోమవారం మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఖర్గే పుట్టినరోజు సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఖర్గే జన్మదిన వేడుకలు



**మంచిర్యాల, జూలై 21 (ప్రభాత సమాచారం)**
అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలను మంచిర్యాల శాసన సభ్యులు ప్రేమ్‌సాగర్ రావు గృహంలో సోమవారం మంచిర్యాల కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**ముథోల్, జూలై 21 (ప్రభాత సమాచారం)**
తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరబడి చోరికి పాల్పడిన సంఘటన భైంసా పట్టణం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయి నగర్ కాలనీలో అద్దెకి ఉంటున్న సాగర స్రామ్రాట్ కొడుకు అనారోగ్యం కారణంగా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి అడ్మిట్ కాగా కుటుంబ సభ్యులందరూ ఆస్పత్రిలో ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడగా... ఈ చోరీలో 8 తులాల బంగారం, 30 తులాల వెండి, 50 వేల రూపాయలు నగదు పోయినట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు.

# జీవో 49 రద్దు చేసే వరకు ఐక్యంగా ఉద్యమిస్తాం

**మందమర్రి, జూలై 21 (ప్రభాత సమాచారం)**
ఆదివాసీలను, పేదలను 339 గ్రామల నుంచి, 3 లక్షల ఎకరాల భూముల నుంచి వెలగొట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెచ్చిన జీఓ 49 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు నాయకులు జీవో కాపీలను దగ్ధం చేశారు. జీవో 49 రద్దు చేయాలని ఆదివాసిలను గ్రామాల నుండి, భూముల నుండి తరలించే కుట్రను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి సంఘాలు ఇచ్చిన జిల్లా బంద్ పిలుపులో భాగంగా పట్టణంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) అధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో, సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వేరువేరుగా నిరసన వ్యక్తం చేస్తూ జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. బీజేపీ మోడీ ప్రభుత్వం



ఆదివాసీ పేదలను వారి గ్రామల నుంచి, భూముల నుంచి వెళ్లగొట్టేందుకు అనేక చట్టాలు చేస్తున్నారని, వీటిని రాష్ట్రంలో అమలు జరపడం కోసం మోడీ ప్రభుత్వానికి మద్దతుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం జిఓ 49 జారీ చేసిందని, జీఓ అమలు కోసం దొడ్డి దారిన ప్రయత్నాలు చేస్తుందని వారు మండిపడ్డారు. జిల్లాలో కవ్వాల్ టైగర్ జోన్, ప్రాణహిత కృష్ణ జింకల ప్రాంతం, శివ్వారం మొసళ్ళ కేంద్రం పేర్లతో ఆంక్షలు విధించడం దుర్మార్గమని వారు ప్రభుత్వం తీరుపై తీవ్రంగా పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా ల వైఖరి ఆదివాసీలకు, పేదలకు వ్యతిరేకంగా, వారి జీవితాలను పూర్తిగా నాశనం చేసేలా ఉన్నాయని, అంతే కాకుండా కార్మిక వర్గాన్ని కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే కుట్రలను మోడీ ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ఆదివాసీ, గిరిజన, పేదలే కాకుండా కార్మికవర్గం కూడా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను విరమించు కోకుంటే ఐక్య పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం సిఐటియు డివిజన్ అధ్యక్షుడు రవి, మండల నాయకులు పెద్ద లచ్చన్న, లక్ష్మి, స్వరూప, రాజేశ్వరి, రాజయ్య, బానయ్య, రవీందర్, వెంకటేషశ్వర్ రావు, నరేష్, అరుణ్‌లు పాల్గొన్నారు.



# సోనారిలో గంగ నీళ్ల జాతర

## వర్షాలు కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకం

**కుభీర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**
గత 15 రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో పంటలు వేసుకున్న రైతులు ఎండు ముఖం పడుతుండడంతో రైతుల్లో గుబులు మొదలైంది. సోయా పత్తి మొలకలు ఎండల తీవ్రతకు తట్టుకోలేకపోతున్నాయి. దీంతో చేసేదేమీ లేక రైతులు ఆకాశం వైపు చూస్తూ దేవుని ప్రార్థిస్తున్నారు. ఈ క్రమంలోనిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని సోనారి గ్రామస్తులు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బాసర గోదావరి నుండి గంగ నీళ్లను తెప్పించి భాజా భజంత్రిలతో శోభయాత్రగా తరలివెళ్లి గ్రామంలోని గ్రామదేవతలతో పాటు గ్రామంలోని, ఆంజనేయస్వామి సాయిబాబా, దత్తాత్రేయ ఆలయాల్లో గ్రామ పొలిమేరల్లో గల పాప హరేశ్వర ఆలయంలో దేవతల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి వర్షాలు కురవాలని వేడుకున్నారు. వీడీసీ అధ్యక్షుడు నాగభూషణం, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికి చర్యలు

## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, జూలై 21 (ప్రభాత సమాచారం)**
బాధితుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి, తమ పరిధిలో ఉండే ప్రతి ఒక్క సమస్య పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల రోజును నిర్వహించిన జిల్లా ఎస్పీ, దాదాపు జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారుల సమస్యలను విని వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా సమస్యల ను పరిష్కరించాలని ఆదేశాలను జారీ చేశారు. పోలీసు ముఖ్య కార్యాలయంలో దాదాపు 26 ఫిర్యాదులు రాగా ఓపికగా సమస్యలను విన్న జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా జిల్లా ఎస్పీ వద్దకు వచ్చే ఫిర్యాదులలో భూ సమస్యలలో కుటుంబ సభ్యుల మోసం, నకిలీ రిజిస్ట్రేషన్లు, డబల్ రిజిస్ట్రేషన్ లతో మోసం చేసే వ్యక్తుల పై ఫిర్యాదులు అందాయని వాటిపై సరైన ఆధారాలతో కేసులను నమోదు చేయాలని తెలిపారు. తదుపరి జిల్లాలో వివిధ కారణాలతో పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న కేసులపై మరియు భార్యాభర్తల సమస్యలపై కుటుంబ కలహాలు, తండ్రి కొడుకుల సమస్యల ఫిర్యాదులు, వడ్డీ వ్యాపారుల సమస్యలు, భూ సమస్యలు వాటి పరిష్కారానికి జిల్లా ఎస్పీకి ప్రజలు సంప్రదించడం జరిగింది. ప్రతి సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల రోజున నిర్వహించడం జరుగుతుందని ప్రజలు సమస్యలపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో లేదా నేరుగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు సమర్పించవచ్చని తెలిపారు. సుదూర ప్రాంతాల వారు జిల్లా ఎస్పీకి వాట్సప్ ద్వారా సమాచారం అందించాలంటే లేదా ఫిర్యాదు చేయాలంటే 8712659973 నెంబర్కు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# 25న ఉట్నూర్‌లో మెగా జాబ్‌మేళా

**ఇచ్చోడ, జూలై 21 (ప్రభాత సమాచారం)**
టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ సహకారంతో ఈనెల25 శుక్రవారం జెసి ఫంక్షన్ హాల్ ఉట్నూర్లో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.అందులో భాగంగా వారు సోమవారం రోజున పార్టీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరిగిందని. తెలంగాణ లోని నిరుద్యోగ యువత ఉద్యోగాలు లేకుండా ఉండకూడదని లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రంగాలలో ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందని అందులో



భాగంగానే టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ నేతృత్వంలో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దీనిని ప్రతి ఒక్కరు నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, ముస్తఫా, కోత్తూరు లక్ష్మణ్, జహీద్, నడికుంట ఆశన్న, శివకాంత్,బాబు పాల్గొన్నారు.

# పొన్నారిలో తాగు నీటి కోసం గ్రామస్తుల రాస్తారోకో



**తాంసి, జూలై 21 (ప్రభాత సమాచారం)**
మండలంలోని పొన్నారి గ్రామం నీటి కొరతతో అల్లాడుతోంది. నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకపోవడంతో గ్రామస్తులు సోమవారం అంతర రాష్ట్ర రహదారిపై రాస్తారోకోకు దిగారు. ప్రత్యేకంగా ఎస్సీ కాలనీలో నివసిస్తున్న కుటుంబాలు నీరు లేక పరేషాన్ అవుతున్నాయని, ఆమాత్రం కనీస వసతి కల్పించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాస్తారోకో కారణంగా గంటకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అటుగా వెళుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి అక్కడికి చేరుకుని గ్రామస్తుల నుంచి సమస్య వివరాలు తెలుసుకున్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమించారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా పైప్ లీకేజీ సమస్య కారణంగా నీటి సరఫరా నిలిచిందని తెలిపారు. అత్యవసరంగా మరమ్మ తులు చేపట్టి తాగునీటిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



# ఏజెన్సీ బంద్ ప్రశాంతం

**ఇచ్చోడ, జూలై 21 (ప్రభాత సమాచారం)**
జీవో నెంబర్ 49 లో రద్దు చేయాలని కోరుతూ ఆదివాసి సంఘాల పిలుపు మేరకు సోమవారం రోజున ఇచ్చోడ మండల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఒక్కరోజు ముందుగానే ఆదివాసీ నాయకులు వ్యాపార వాణిజ్య సముదాయాల యజమానులకు బంద్ కు సహకరించాలని కోరడంతో వ్యాపార వాణిజ్య సంస్థ యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఉదయం నుంచి ఆదివాసి సంఘాల నాయకులు మండల కేంద్రంలో తిరుగుతూ బందుకు సహకరించాలని కోరడంతో ప్రశాంతంగా బంద్ ముగిసింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులనే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీల మనుగడ జీవో నెంబర్ 49 తో ప్రశ్నార్థకంగా మారిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ జీవోను రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఇచ్చోడా మండల ఆదివాసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నాలుగు వరుసల రోడ్డు

# మంజూరుపై హర్షం

**ముథోల్, జూలై 21 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ నుండి కళ్యాణ్ ఎన్హెచ్ 61 ప్రస్తుత రెండు వరుసల రోడ్డు ను తెలంగాణ పరిధిలోని 53 కి.మీ లు నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం మంజూరు చేయడం పై ముథోల్ బిజెపి నాయకులు తాటివార్ రమేష్ సోమవానం ఒక్క ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో స్థానిక ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, పాల్వాయి హరీష్ బాబు, ఎంపీ గోడం నగేష్ ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి ఈ రోడ్డు విస్తరణ పనులపై విన్నవించారని ఆయన తెలిపారు. దీంతో తాజాగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 15 రోడ్లను నాలుగు వరుసల జాతీయ రహదారులుగా నిర్మాణం చేపట్టుటకు రూ. 33,690 కోట్ల వ్యయంతో 2028 సంవత్సరం వరకు పూర్తి చేయాలని నిర్ణయించిందని అన్నారు. దీనికి సంబంధించిన పూర్తి డిపిఆర్ ను త్వరగా తయారు చేయాలని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని ఆయన పేర్కొన్నారు. ఇందులో నిర్మల్, భైంసా నాలుగు వరుసల రహదారి కూడా ఉందన్నారు. ఈ నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే రోడ్డు ప్రమాదాలతో పాటు, ట్రాఫిక్ సమస్యలు కూడా తీరనున్నాయి.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత



**ఇచ్చోడ, జూలై 21 (ప్రభాత సమాచారం)**
మండలంలోని సాత్ నెంబర్ గ్రామానికి చెందిన రాథోడ్ సురేష్ 35 గత 15 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అయినా జల్ద గ్రామానికి చెందినతాజా మాజీ సర్పంచ్ గిత్తే నందా కిశోర్, ముక్రా బి మాజి సర్పంచ్ మారుతీ సోమవారం రోజున గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి ఒక నెల సరిపడా నిత్య వసర సరుకులను అందజేశారు. మృతునికి తల్లిదండ్రులతో పాటు భార్య మరియు ముగ్గురు పిల్లలు ఉన్నారని వారికి అధైర్య పడవద్దని ఎల్లవేళలా తాము అండగా ఉంటామని తెలిపారు. మండలంలో ఎవరైనా చిన్న వయసులో కుటుంబ పెద్ద చనిపోతే తమ దృష్టికి తీసుకువచ్చి నట్లయితే ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అండదండలతో ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. వారి వెంట బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు రాథోడ్ ప్రవీణ్, వినోద్, ఫిరోజ్, విక్రమ్,తదితరులు ఉన్నారు.



## వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు

**ఖానాపూర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్‌లోని అంబేడ్కర్ కాలనీలో వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రకు కప్పను కట్టి వీధులలో ఊరేగించారు. సాంప్రదాయ గీతాలు పాడుతూ వరుణ దేవుడు కరుణించాలని తమదైన రీతిలో నైవేద్యాలను సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి కప్పతల్లి ఆటలాడారు. సాంప్రదాయ పద్ధతులలో చిన్నారులు పండగను నిర్వహించుకొని పవిత్ర జలాలతో స్నానాలు చేయించారు.

## గోదావరి జలాలతో పాదయాత్ర

**బెల్లంపల్లి, జూలై 21 (ప్రభాత సమాచారం)**

కాసిపేట మండలంలోని దేవాపూర్ ప్రాంత భక్తులు మంచిర్యాల గోదావరి జలాలను తీసుకుని పాదయాత్ర చేపట్టి బెల్లంపల్లి మండలం కన్నాల శ్రీ బుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి జలాభిషేకం నిర్వహించారు. ఆషాడమాసంలో శివునికి గంగాజలంతో అభిషేకం జరిపిస్తే ప్రకృతికి మేలు జరుగుతుందన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, యువతలో ఆధ్యాత్మిక భావం పెంపొందించేందుకు యాత్ర చేపట్టామన్నారు.

## వర్షానికి నేలకూలిన భారీ వృక్షం



**కెరమెరి, జూలై 21 (ప్రభాత సమాచారం)**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరామెరి మండలం ఝరీలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ప్రధాన రహదారిపై చెట్టు విరిగి పడింది. వీలైనంత త్వరగా స్థానికులు, వాహనదారుల సహకారంతో చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో కొంత సమయం వరకు వాహనాల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**సారంగాపూర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి ఉన్నత పాఠశాల 1991-92 లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. బీరవెల్లిలో ఈ కార్యక్రమం సందడిగా సాగింది. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డ సుమారు 47 మంది పూర్వ విద్యార్థులు దాదాపు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకుని బాల్యస్మృతులు గుర్తు చేసుకున్నారు. ఆత్మీయ ఆలింగనాలు. పలకరింపులతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

# ప్రశాంతంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్



**ఆదిలాబాద్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

జీవో 49కు వ్యతిరేకంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బంద్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు స్వచ్ఛంగా బంద్ పాటించాయి. సోమవారం ఉదయం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్క దుకాణం కూడా తెరచుకోలేదు. బస్సులు కూడా నడవకపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొన్ని చోట్ల ఆర్టీసీ బస్సులు డిపోల నుంచి బయటకు రాకుండా అడ్డగించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ఉట్నూర్ ఏజెన్సీలో బంద్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లోనూ ప్రజలు స్వచ్ఛంగా బంద్ పాటిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలు ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని భారత రాజ్యాంగంలో పొందుపరిచిన 1/70, పెసా, ఆదివాసి చట్టాలను, ఆదివాసీల అస్తిత్వాన్ని, ఆదివాసీల మనుగడను ఆదివాసిల హక్కులను జీవోలను ఉల్లంఘిస్తూ ఏటువంటి గ్రామసభ తీర్మానాలు లేకుండానే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్రం భీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకువచ్చిన జీవో 49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు ఆదివాసీ తుడుందెబ్బతోపాటు ఆదివాసి సంఘాలు పిలుపునిచ్చాయి. దీనికి సీపీఎం, సీపీఐ పార్టీలు సంఘీభావం ప్రకటించాయి.

## బంద్‌తో డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు



**ఆదిలాబాద్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

జీవో నెంబర్ 49 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి సంఘాలు చేపట్టిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఆదివాసీల బంద్‌కు వివిధ రాజకీయ పార్టీలతో పాటు ఆయా ప్రజా సంఘాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. సోమవారం ఉదయం నుండి తుడుం దెబ్బతో పాటు ఆదివాసీల్లోని 9 తెగల ఆయా సంఘాల నాయకులు జిల్లా కేంద్రంతో పాటు ఉట్నూర్, ఏజెన్సీ ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ తెరిచి ఉన్న దుకాణాలను మూసి వేయించారు. బంద్ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సిడం శంభు ఆశయాల సాధన కోసం కృషి : ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఆదిలాబాద్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

జీవితాంతం ఆదివాసీ హక్కులకై పోరాడిన మలిదశ ఉద్యమ కారుడు సిడం శంభు ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఉట్నూర్ మండలంలోని మత్తడి శంభుగూడలో సిడం శంభు 7వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా సిడం శంభు సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ... సిడం శంభూ ఆదివాసీల కోసం అహర్నిశలు కృషి చేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలు పునిచ్చారు. సమాజ హితం కోసం పాటు పడిన ఉద్యమ నాయకుడి కుటుంబానికి మనమంతా కలసి అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో శంభు కుటుంబీకులు, ఆదివాసీ నేతలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్‌కు ఏరియా స్టోర్స్ ఉద్యోగుల నివాళులు

**మందమర్రి, జూలై 21 (ప్రభాత సమాచారం)**

ఏరియాలోని ఏరియా స్టోర్స్‌లో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొత్తపల్లి శ్రీనివాస్ కు ఏరియా స్టోర్స్ ఉద్యోగులు ఘనంగా నివాళులు అర్పించారు. ఏరియా స్టోర్స్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళులు అర్పిస్తూ, ఆయనతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా డిజిఎం ఎస్ఈ(ఈఅండ్ఎం), స్టోర్స్ ఇంచార్జ్ ఎస్ సురేష్ మాట్లాడుతూ, కొత్తపల్లి శ్రీనివాస్ మృతి అత్యంత బాధాకరమని తెలిపారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు సింగరేణి యాజమాన్యం, ఏరియా స్టోర్స్ తరపున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే శ్రీనివాస్ మృతి చెందాడని ప్రచారం జరగడం బాధను కలిగించిందని, అది పూర్తిగా అవాస్తవమని తెలిపారు. మే 6న ఏరియా స్టోర్స్ లో మృతునిపై తేనెటీగలు దాడిచేయగా ఎవరికి చెప్పకుండా కేకే 1 డిస్పెన్సర్ కి చికిత్సకి వెళ్లగా, వైద్య పరీక్షల్లో అతనికి బిపి అధికంగా ఉండటంతో వైద్యులు ఆసుపత్రిలో అడ్మిట్ కావాలని తెలుపగా, అక్కడి నుండి ఎవరికి తెలుపకుండా మృతుడు స్టోర్స్ కు తిరిగి వచ్చాడని, ఆసుపత్రి సిబ్బంది ఏరియా స్టోర్స్ కు ఫోన్ చేసి, విషయం తెలపడంతో వెంటనే ఆరోగ్యం మంచిగా చూసుకోవాల్సిందిగా సూచిస్తూ, ఒక



అటెండర్ ను ఇచ్చి, తిరిగి ఆసుపత్రికి పంపించడం జరిగిందని, ఆసుపత్రిలో అడ్మిట్ చేసి, వారి కుటుంబ సభ్యులకు విషయం తెలియ జేయడం జరిగిందన్నారు. రెండు రోజుల అనంతరం ఆసుపత్రి నుండి ఫిట్ తీసుకొని వచ్చి, తిరిగి విధుల్లో చేరాడని, కొద్దిరోజులు విధులు నిర్వహించిన అనంతరం అతని ఆరోగ్య పరిస్థితి క్షీణించి, బ్రెయిన్ స్ట్రోక్ గురై ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యి, వైద్య చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఈ విషయంపై నిజా నిజాలు తెలుసుకోకుండా స్టోర్స్ అధికారులు నిర్లక్ష్యం మూలంగానే శ్రీనివాస్ మృతి చెందాడని వదంతులు సృష్టించారని, ఈ వార్త మరింత తీవ్ర భాదను కలిగించిందన్నారు. మృతుని కుటుంబానికి సింగరేణి యాజమాన్యం, ఏరియా స్టోర్స్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.




## జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**ఆసిఫాబాద్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

వర్షకాలంలో ప్రజల సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, గడ్డం వివేకానంద, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, ప్రదాన కార్యదర్శి రామకృష్ణరావు, ఇతర ఉన్నతాదికారులతో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసుశాఖ, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. వర్షకాలం సీజన్‌లో అదికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువులలో నీటి నిలువల స్థాయి వినియోగం వానకాలం సీజన్‌లో వ్యవసాయసాగు, యూరియా నిల్వలు ఎరువుల కొరత లేకుండా సమకూర్చాలని సూచించారు. బారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జనజీవనం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా వర్షాల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా ఐటీడీఏ అదికారులు ముందస్తూ చర్యల్లో బాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని చెప్పారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి అకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు. విధులను అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాలలో మండల కేంద్రాలలో అదికారికంగా రేషన్‌కార్డులను పంపిణీ చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్ల, ఏఎస్పీ చిత్తరంజన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.





# విద్యార్థులు పెరిగారు.. టీచర్లు తగ్గారు

■ తాళ్లపేట పాఠశాల ఉపాధ్యాయుల కృషితో పెరిగిన సంఖ్య ■ 36 నుంచి 90కు చేరిన విద్యార్థులు
■ బడిని బతికించిన టీచర్లకు గ్రామస్తుల అభినందనలు ■ ఐదు తరగతులకు పాఠాలు బోధిస్తున్నది ముగ్గురే..
■ సరిపడా సిబ్బందిని కేటాయించాలని కోరుతున్న స్థానికులు

**దండేపల్లి, జూలై 21 (ప్రభాత సమాచారం)**

తాళ్లపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కృషితో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి మరీ 50కి పైగా అడ్మిషన్లు చేయించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. విద్యా సంవత్సరం ప్రారంభంలో 36 మంది మాత్రమే ఉండగా, ప్రస్తుతం 90 మందితో స్కూల్ కళకళలాడుతున్నది. ఇక ప్రస్తుతం ముగ్గురే ఉపాధ్యాయులుండగా, విద్యార్థుల సంఖ్యకనుగుణంగా సిబ్బందిని కేటాయించాలని ఇన్‌చార్జి హెచ్ఎం ప్రభాకర్, గ్రామస్తులు కోరుతున్నారు.

**ఐదు తరగతులు.. ముగ్గురే ఉపాధ్యాయులు..**

తాళ్లపేట ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉండగా, ప్రస్తుతం 90 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఈ యేడాది విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పుడు 36 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలలో ఉన్నారు. 36 మందికి ఐదుగురు ఉపాధ్యాయులు విద్యా బోధన చేశారు. జూన్‌లో హెచ్ఎంగా పనిచేసిన జగదీశ్వర్‌గౌడ్ ఉద్యోగ విరమణ చేశారు. ఇక సరిపడా విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో విద్యాధికారులు సర్దుబాటులో భాగంగా మరొక ఉపాధ్యాయురాలిని రెబ్బెన్‌పెల్లి పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. ఇక మిగిలిన ముగ్గురు ఉపాధ్యాయులు ప్రభాకర్, రామరాజు, శ్రీనివాస్ బడి ని బతికించుకోవాలని నిర్ణయించి ఇంటింటా తిరిగి విద్యార్థుల సంఖ్యను పెంచారు.

**50కి పైగా పెరిగిన అడ్మిషన్లు...**

తాళ్లపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఈ యేడాది (2025-26) ప్రారంభంలో ఒకటి నుంచి ఐదు తరగతులకు కలిపి 36 మాత్రమే ఉండేది. ఈ నేపథ్యంలో బడిని బతికించుకునేందుకు ఉపాధ్యాయులు ప్రభాకర్, రామరాజు, శ్రీనివాస్ ఒక్కటయ్యారు. బడిబాటలో భాగంగా పట్టుదలతో ఇంటింటా తిరిగారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. అన్ని సౌకర్యాలున్న బడిలోనే పిల్లలను చేర్పించాలని, ప్రైవేట్‌కు పంపించవద్దంటూ అవగాహన కల్పించారు. ఇంకేముంది గ్రామస్తులంతా ఒక్కటే తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించారు. ప్రస్తుతం 90 మంది విద్యార్థులతో బడి కళకళలాడుతుండగా, గ్రామస్తులతో పాటు మండల విద్యాధికారులు ఉపాధ్యాయులను అభినందిస్తున్నారు. కాగా, విద్యార్థుల సంఖ్య పెరిగినా ఐదు తరగతులకు కేవలం ముగ్గురే ఉపాధ్యాయులు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయురాలిని తిరిగి పాఠశాలకు పంపించాలని గ్రామస్తులు, పోషకులు కోరుతున్నారు. తాళ్లపేట పాఠశాలకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు.

# మంచిర్యాల ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల నిరసన




**మంచిర్యాల, జూలై 21 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నెంబరు 49ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్య దర్శి సంకె రవి డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రం లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టి జీవో కాపీలను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ దివాసీలను, పేదలను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలతో చెలగాట మా డుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీవో నెంబరు 49 తీసుకువచ్చి మోదీ ఎజెండాను అమలు చేస్తున్నారన్నారు. దీని వల్ల ఆదివాసీలు, పేద లు వారు నివసిస్తున్న 339 గ్రామాలను 3 లక్షల ఎకరాల భూమిని కో ల్పోతున్నారన్నారు. అడవులను, భూములను కార్పోరేట్ సంస్థల కు అప్పగించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలు, పేదలపై యుద్ధం ప్రకటిస్తున్నాయని ఇది సరైంది కాదన్నారు. మంచిర్యాల జిల్లాలో కవ్వాల్ టైగర్ జోన్, ప్రాణహిత కృష్ణ జిం కల ప్రాంతం, శివ్వారం మొసళ్ల అభయార్యణం కేంద్రాల పేరుతో సగం జిల్లాను ఖాళీ చేయించే కుట్రలను గత, ప్రస్తుత ప్రభు త్వాలు చేస్తున్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలో ఫారెస్టు అధికారు లు వందల మంది ఆదివాసీలు, పేదలపై అక్రమ కేసులు పెట్ట డం, జైళ్లకు పంపారని, పట్టాలున్న భూములను కూడా బల వంతంగా లాక్కుంటున్నారన్నారు. వెంటనే ఈ జీవోను రద్దు చే యాలని లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు గోమాస ప్రకాష్, దుంపల రంజిత్‌కుమార్, దూ లం శ్రీనివాస్, రాములు, శ్రీకాంత్, రత్నవేణి, నిర్మల, రాంచరణ్, రాజ్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

**చెన్నూరు :** ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబరు 49ని రద్దు చేయా లని కోరుతూ సోమవారం చెన్నూరు పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్ర హం వద్ద తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేయడంతో పాటు జీవో 49 కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్య దర్శి ఎర్మ పున్నం, నాయకులు మహేష్, ఉమారాణి, సరిత, శారద పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీ ఎం పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.

**కాసిపేట:** 49 జీవోను రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ తుడుం దె బ్బ ఇచ్చిన పిలుపు మేరకు మండలంలో బందు ప్రశాంతంగా జరిగింది. తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడె జంగు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 49 జీవో ద్వారా ఆదివాసీలను అడవికిదూరం చేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ తుడుం దెబ్బ సంఘాల నాయ కులు మడావి వెంకటేశ్, పెంద్రం శంకర్, హన్మంతు పాల్గొన్నారు.



## ఆదివాసీల సంక్షేమమే
# బీజేపీ పార్టీ లక్ష్యం

**స్థానిక సంస్థల్లో పార్టీ విజయానికి కృషి చేయాలి..**
**ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

ఆదివాసుల సంక్షేమం, అభివృద్ధి కోసం దేశ ప్రధాని కృషి చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. సోమవారం బేల మండలం బోరిగామ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంత బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆదివాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో నెలకొన్న రోడ్డు, మంచినీటి తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బోరిగామ గ్రామం పూర్తిగా ఆదివాసి గ్రామమని, సంవత్సరం లోపు గ్రామంలో నెలకొ న్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. గ్రామంలో ఇల్లు లేని వారి వివరాలను తనకు అందించాలని సూచించారు. ఆది వాసి పివిటీజీల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక నిధులను మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలో కేంద్ర సహాయ మంత్రి పర్యటించిన నేపథ్యంలో ఆదివాసీల సమస్యలను వివరించడం జరిగిందన్నారు. ఆదివాసీలను ఆర్థికంగా బలోపేతం చసేందుకు వివిధ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు ఆయన తెలిపారు. ఆదివాసీల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు బేలా మండల కేంద్రంలో జరిగిన బీజేపీ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పార్టీ గెలిపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నగేష్, సుభాష్, రమేష్, విజయ్, రాము, సురేష్ పాల్గొన్నారు.

## పాము కాటుతో
# వివాహిత మృతి

**జైనూర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండలంలోని గ్రామ పంచాయతీ పోచంలోద్ది కొండపటర్ కి చెందిన సిడం కన్నీ బాయి (44) ని నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేయడంతో నిద్రనుండి మేల్కొని తన భర్త కి విషయం తెలియజేయగా అదే గ్రామానికి చెందిన ఆటోలో జైనూర్ హాస్పిటల్‌కు తరలించడం జరిగింది. జైనూర్ నుండి ఉట్నూర్‌కు రిఫర్ చేయడం జరిగింది, అక్కడినుండి అదిలాబాద్ రిమ్స్‌కు రిఫర్ చేయడంతో చికిత్స ఆలస్యం అవడంతో మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.



# ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**నిర్మల్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

నిర్మల్‌లో నిర్వహించిన ఇందిర మహిళా శక్తి కార్యక్రమం ఆరంభంలో తెలంగాణ రాష్ట్ర గీతాన్ని అవమానించినందుకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించినందుకు బీజేపీ ఎల్పీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన దిష్టిబొమ్మను సోమవారం నిర్మల్ పట్టణంలో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యం లో దహనం చేశారు. తెలంగాణ అమరవీరు ల జ్ఞాపకార్ధంగా రచించుకున్న రాష్ట్ర గీతాన్ని అవమానపరిచినందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను ఆత్మ డైరెక్టర్ రామ్ రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షులు సమరసింహారెడ్డి, దేవరకోట ఆలయ చైర్మన్ కొండ శ్రీని వాస్, సాయిబాబా ఆలయ చైర్మన్ బూరా జ్, నిర్మల్ మండల అధ్యక్షులు కుంట వేణుగోపాల్, హజార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



- భారీ వర్షాలతో అన్నదాతల హర్షం
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు
- మొలకెత్తుతున్న మొక్కజొన్న, వరి
- పచ్చ బంగారంపైనే రైతుల ఆశలు

# ఆశల 'సాగు'



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. పల్లెల్లో సాగు సందడి జోరందుకుంది. వానకాలం వ్యవసాయ సాగులో రైతులు, కూలీలు బిజీ అయ్యారు. విత్తనాలు విత్తుకోవడం, కలుపు మొక్కలను తొలగించడం, పురుగు మందులు పిచికారీ చేయడం, ఎరువులు చల్లడం వంటి పనులతో పంట చేలలో సందడి కన్పిస్తోంది. గత నెల వరకు అనుకున్నట్లుగా వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. కానీ.. గడిచిన కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు కర్షకుల్లో ఆశలను చిగురింపజేశాయి.













# కండలు తిరిగిన బాడీతో రామ్ చరణ్



'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు- రామ్ చరణ్ కాంబోలో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ 'పెద్ది' పై రోజురోజుకు అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తన పాత్ర కోసం కఠినమైన వర్కౌట్లు, ప్రత్యేక డైట్ ఫాలో అవుతున్నాడు. ఫోటోలో చరణ్ కండలు తిరిగిన దేహం, రగ్గడ్ లుక్ ఫ్యాన్స్ లో మరింత ఆసక్తిని పెంచుతోంది. సినిమా కోసం తన శారీరక రూపాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారు. గత సినిమా 'గేమ్ ఛేంజర్' లో స్టైలిష్ గా కనిపించిన రామ్ చరణ్.. 'పెద్ది' పూర్తి బిన్నంగా కనిపించబోతున్నారని తెలుస్తోంది. స్పోర్ట్స్ డ్రామాగా గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రామ్ చరణ్ ఒక క్రికెటర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'పెద్ది' ఫస్ట్ షాట్ వీడియోలో చరణ్ బ్యాట్ తో షాట్ కొట్టిన విధానం ఫ్యాన్స్ తో విజిల్స్ వేయించింది. వృద్ధీ సినిమాస్' బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు.



# ఇక సినిమాలు చేయను..



నాలుగేళ్ళ పవన్ స్టార్ ఫ్యాన్స్ నిరీక్షణ మరో మూడు రోజుల్లో తీరబోతుంది. పలు మార్లు వాయిదా పడుతూ వచ్చిన పవన్ 'హరిహర వీరమల్లు' ఎట్టకేలకు జులై 24న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. పవన్ రాజకీయాలతో బిజీగా ఉండడంతో 2021లో మొదలైన ఈ సినిమా పూర్తవడానికి నాలుగేళ్లు పట్టింది. ఇక రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ షురూ చేసింది చిత్రబృందం. ఇందులో భాగంగా ఈరోజు ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ ప్రెస్ మీట్ లో పవన్ కళ్యాణ్, డైరెక్టర్ జ్యోతి కృష, నిర్మాత ఏఎం. రత్నం, హీరోయిన్ నిధి అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. సినిమాకు సంబంధించిన విశేషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ తన సినీ కెరీర్, తదుపరి ప్రాజెక్టుల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇక భవిష్యత్తులో సినిమాలు చేస్తానో, చేయనో నాకు తెలియదు!.. దాదాపు సినిమాలకు దూరంగా ఉంటాను" అని అన్నారు. ఇండైరెక్ట్ గా ఇకపై సినిమాలు చేయనని చెప్పకనే చెప్పారు పవన్. దీంతో పవన్ ఫ్యాన్స్, సినీ ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు పవన్ స్టేట్మెంట్ పట్ల అందరూ ఆశ్చర్యపోయారు కూడా! ఒకవేళ ఇదే జరిగితే 'ఉస్తాద్ భగత్ సింగ్' పవన్ చివరి సినిమా అవుతుంది. పీరియాడిక్ డ్రామాగా రూపొందిన 'హరిహర వీరమల్లు' చిత్రానికి జ్యోతికృష్ణ దర్శకత్వం వహించారు. ఆస్కార్ విజేత కీరవాణి సంగీతం అందించారు. నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించగా... సత్యరాజ్, నోరా ఫతేహి, బాబీ డియోల్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

# ముచ్చటగా మూడోసారి?



వైవిధ్యమైన కథలతో తెరపై సందడి చేస్తూనే.. నిర్మాతగా కూడా రాణిస్తోంది అందాల తార సమంత. ఇటీవలే ఈమె నిర్మాణ సంస్థలో రూపొందిన 'శుభమ్' మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడామె తన సొంత నిర్మాణంలో రూపొందుతున్న ఓ ప్రాజెక్టులో నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని నందిని రెడ్డి తెరకెక్కించనున్నట్లు సమాచారం. "ప్రస్తుతం ఓటీటీ కథలతో తీరిక లేకుండా గడుపుతోన్న సమంత.. తన రాబోయే ప్రాజెక్టు కోసం సన్నాహాలు మొదలు పెట్టింది. దీని కోసం ఇప్పటికే దర్శకురాలు నందినితో చర్చలు చేస్తోంది. ఈ ప్రాజెక్టును స్వయంగా ఆమె నిర్మించాలని అనుకుంటోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నార"ని సమంత సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నందిని, సమంత కలయికలో 'జబర్దస్త్', 'ఓ బేబీ' సినిమాలు వచ్చిన సంగతి తెలిసిందే. మరి ముచ్చటగా మూడోసారి వస్తోన్న ఈ కాంబినేషన్ తెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# శ్రీలీలకి మరో బంపర్ ఆఫర్..

పుష్ప 2' లోని స్పెషల్ సాంగ్ కి ముందు 'శ్రీలీల' సినీ కెరీర్ కొంచం డల్ గానే సాగిందని చెప్పవచ్చు. నిజానికి 'రవితేజ' ) తో కలిసి చేసిన 'ధమాకా' తర్వాత చాలా సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి. కానీ అవన్నీ ఫ్లాప్ గా నిలవడంతో కొత్త ఆఫర్స్ రావడం తగ్గిపోయాయి. కానీ పుష్ప 2 సాంగ్ తర్వాత మాత్రం మళ్ళీ ఆమె జోరు మొదలైంది. పైగా తెలుగు కంటే హిందీలో ఎక్కువ ఆఫర్స్ రావడం ప్రారంభించాయి.ఈ కోవలోనే స్టార్ హీరో 'కార్తీక్ ఆర్యన్' తో కలిసి 'ఆషీకీ పార్ట్ 3' ద్వారా బాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. కంప్లీట్ లవ్ స్టోరీ గా తెరకెక్కుతున్న ఈ మూవీలో హీరోయిన్ క్యారక్టర్ కి మంచి ఇంపార్టెన్స్ ఉంది. గతంలో తెరకెక్కిన 'ఆషీకీ' రెండు బాగాలే అందుకు ఉదాహరణ. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉండగా, ఈ సంవత్సరమే ప్రేక్షకుల ముందుకు రానుంది. అగ్ర దర్శకుడు, అగ్ర నిర్మాత 'కరణ్ జోహార్' నిర్మించే ఒక భారీ చిత్రంలో కూడా 'జాన్వీకపూర్‌ప్లేస్ లో శ్రీలీల ని పరిశీలిస్తున్నట్టుగా తెలుస్తుంది. రీసెంట్ గా 'శ్రీలీల'కి బాలీవుడ్ మరో అగ్ర హీరో 'రణవీర్ సింగ్' పక్కన హీరోయిన్ గా చేసే అవకాశం వచ్చినట్టుగా వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రం కంప్లీట్ యాక్షన్ జోనర్ లో తెరకెక్కబోతుందని, యానిమల్ ఫేమ్ 'బాబీడియోల్' కూడా ఒక కీలక పాత్రలో చేస్తున్నాడని, బాలీవుడ్ సినీ సర్కిల్స్ లో జోరుగా చర్చ నడుస్తుంది. మేకర్స్ ఇప్పటికే శ్రీలీల ని సంప్రదించారని, ఆమె కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు టాక్.

# కుమ్రంభీం జిల్లాలో బంద్ సంపూర్ణం



**ఆసిఫాబాద్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

జిల్లా వ్యాప్తంగా జీవో 49ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపు సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. పోలీసులు బంద్‌కు సంబంధించి పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేశారు. ఉదయం నుండే వాణిజ్య సముదాయాల యజమానులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనగా ఆర్టీసీ బస్సులు అరకొరగా నడిచాయి. బస్టాండు ఎదుట ధర్నా నిర్వహించి బస్సులు బయటికి వెళ్లకుండా చూశారు. అనంతరం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బంద్‌తో రోడ్లన్ని నిర్మానుష్యంగా మారాయి. బంద్ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో సీఐ రవీందర్ బందో బస్తు ఏర్పాట్లను పరిశీలించారు. రాత్రి నుంచి పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా కేంద్రానికి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలి రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఏదీ ఏమైన బంద్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కోవవిజయ్, మాలశ్రీ, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు..

**కాగజ్‌నగర్ :** గిరిజన సంఘాలిచ్చిన పిలుపు మేరకు కాగజ్ నగర్‌లో బంద్ సక్సెస్ అయింది. ఈ సందర్భంగా పట్టణ వ్యాపార సంస్థలన్నీ కూడా స్వచ్ఛందగా మూసివేసి బంద్‌కు సహకరించాయి. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయిహరీష్ బాబు పట్టణంలో తిరిగారు. వివిధ సంఘాల నాయకులు కూడా ఈ బంద్‌కు పూర్తిగా సహకరించారు. ఆయా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**చింతలమానేపలి :** మండలంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ సంపూర్ణం అయింది. ఈ సందర్భంగా దుకాణాలను బంద్ చేయించి శివాజీ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ప్రసాద్, శంకర్, భీమేష్, ఆపూరావు, పనేందర్, సాగర్, రూపేష్, సుధాకర్, బీజేపీ నాయకులు రామన్న, అంకులు పాల్గొన్నారు.

**బెజ్జూరు :** మండలంలో ఆదివాసీ సంఘాలు తలపెట్టిన బంద్ విజయవంతం అయింది. కార్యక్రమంలో నాయకులు సకారాం, తిరుపతి, శంకర్, రాజు, వెంకటేష్, మోహన్, రాజారాం, అమృత, తిరుపతి, వశీఖాన్, కిషన్ పాల్గొన్నారు.

**కెరమెరి :** ఆదివాసీ సంఘాలు తలపెట్టిన బంద్ మండలంలో విజయవంతం అయింది. ఈ సందర్భంగా దుకాణాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఆయా కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పెంచికలపేట :** మండలంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ సంపూర్ణం అయింది. ఈ సందర్భంగా దుకాణాలను బంద్ చేయించి శివాజీ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుకర్, అశోక్, సకారాం, మల్లేష్, భుజంగరావు, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**సిర్పూర్(టి) :** మండలంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ సంపూర్ణం అయింది. ఈ సందర్భంగా దుకాణాలను బంద్ చేయించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, బీజేపీ నాయకులు లావణ్య, షేక్‌చాంద్, తదితరులు పాల్గొన్నారు. ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో భారీ బందో బస్తు నిర్వహించారు.

**వాంకిడి :** జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు కోసం తీసుకు వచ్చిన జీవో.49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాలు తుడుం దెబ్బ ఇచిచన బంద్ పిలుపు సోమవారం విజయవంతం అయింది. వాణిజ్య, వ్యాపార సముదాయాలు మూసి ఉంచారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందో బస్తు నిర్వహించారు.

**తిర్యాణి :** మండలంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ సంపూర్ణం అయింది. ఈ సందర్భంగా దుకాణాలను బంద్ చేయించి కుమరం భీం విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

**సిర్పూర్(యు) :** ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బంద్ మండలంలో సంపూర్ణంగా జరిగింది. ఆదివాసీలు ఇచ్చిన బంద్‌లో భాగంగా ఆయా కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కుమ్ర భీమ్‌రావు, ఉపాధ్యక్షుడు ఆత్రం దౌలత్‌రావు నాయకులు పెందోర్ నాగోరావు, మడావి శంకర్, లచ్చన్న, నగేష్, సేద్మకి దౌలత్‌రావు, ఆత్రం నాగోరావు, మేస్రం జంగు, తిరుపతి, శంకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

**జైనూర్ :** ఆదివాసీలు ఇచ్చిన పిలుపులో భాగంగా మండల కేంద్రంలో సోమవారం బంద్ సంపూర్ణంగా కొనసాగింది. వాణిజ్య, వ్యాపార సముదాయాలు బంద్‌ను స్వచ్ఛందంగా పాటించి పూర్తి మద్దతు పలికారు. అవాంఛనీయ సంఘటనలు జర్గకుండా సీఐ వెల్పుల రమేష్, ఎస్సై రవికుమార్ పర్యవేక్షణలో బందో బస్ నిర్వహించారు.



## ఖానాపూర్ ఎఫ్‌డిఓగా శివకుమార్

**ఖానాపూర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ ఇంచార్జ్ ఎఫ్‌డిఓగా శివకుమార్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన నిర్మల్ జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డిఓగా పనిచేస్తూ, అదనంగా ఖానాపూర్ బాధ్యతలు స్వీకరించినారు. నూతనంగా వచ్చిన ఈయనకు పలువురు పట్టణ ప్రముఖులు స్వాగతం పలికారు.

## బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రావు



**బెల్లంపల్లి, జూలై 21 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓగా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పోలీసులు ఘనస్వాగతం పలుకుతూ పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు పోలీస్ సిబ్బంది, ప్రజలు సహకారాలు అందించాలని సూచించారు.

## రైతులకు ఊరటనిచ్చిన వర్షం

**సోన్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

గత కొన్ని వారాలుగా ముఖం చాటేసిన వరుణ దేవుడు సోమవారం సాయంత్రం ఒకేసారి కురవడంతో సోన్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలలో రైతులు హర్షం వ్యక్తం చేశారు. విత్తనాలు విత్తి ఆకాశం దిక్కు చూస్తున్న రైతన్నకు ఊరాట కలిగింది. మాదాపూర్, చామన్‌పల్లి, పాక్‌పట్ల, జాఫ్రాపూర్, సిద్ధులకుంట, సంఘం పేటాలలో మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే గ్రామాలలో కప్పతల్లి ఆట నిర్వహించారు.

# జీవో 49 రద్దు చేసి ఆదివాసీ హక్కులను కాపాడాలని గవర్నర్‌ను కోరిన మాజీ ఎంపీ సోయం బాపూరావు







**ఉట్నూర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ పేరిట జారీ చేసిన జీవో 49 ఆదివాసి హక్కులను కాలరాసే విధంగా ఉందని ఈ జీవోను వెంటనే రద్దుచేసి ఆ ప్రాంతంలో నివసించే గిరిజన గిరిజనేతరుల కు స్వేచ్ఛ కల్పించాలని మాజీ ఎంపీ సోయం బాపూరావు తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు హైదరాబాదులోని గవర్నర్ నివాస గృహమైన రాజ్ భవన్ లో ఆదివాసీ నాయకులతో కలిసి గవర్నర్ తో ఆదివాసుల సమస్యల గురించి చర్చించారు. కొముురం భీం జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్నగర్ డివిజన్ల ను ఏకపక్షంగా టైగర్ కన్జర్వేషన్ లో కలపడం వల్ల అడవులు అటవీ భూములను నమ్ముకొని బతికే గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు ముందుకు వస్తున్న క్రమంలో జీవో 49 జారీ చేయడం తగదని సూచించారు. ఇప్పటికే ఈ జిల్లాలో జీవో 49 రద్దు చేయాలని ఆందోళనలు చేస్తున్నారని, దీనివల్ల 339 ప్రభావిత గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు.ఆదివాసి గిరిజనులకు న్యాయం చేసేలా హామీ ఇచ్చినట్టు సోయంబాపూ రావు తెలిపారు గవర్నర్ ను కలిసిన వారిలో మాజీ ఎంపీ సోయం బాపూరావు తో పాటు జాతీయ అఖిల భారతీయ గోండ్వానా మహాసభ ఉపాధ్యక్షులు సిడం అర్జు మాస్టర్,జిల్లా మేడి కురిసేంగా మోతిరాం , రాజ్ గోండ్ రాష్ట్ర కార్యదర్శి పెందూర్ సుధాకర్, రాజ్ గోండ్ సేవ సమితి జిల్లా కార్యదర్శి మాడవి నర్సింగ్ రావు, తిర్యాణి మండల సర్ మేడి అడ సాను, మాజీ ఎంపిటిసి ఉప మేడి ఆత్రం లింగు, రాజ్ గోండ్ సేవ సమితి జిల్లా ప్రచార కార్యదర్శి ఆత్రం చందన్ షా, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు ఆత్రం రకు , మానవ హక్కుల జిల్లా అధ్యక్షులు ఆత్రం లింగారావ్ తదితరులు ఉన్నారు.

# ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలి

**మందమర్రి, జూలై 21 (ప్రభాత సమాచారం)**

సింగరేణిలో ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జిఎం రఘుకుమార్, ఏరియా ఇన్చార్జి జిఎం విజయ్ ప్రసాద్ లు కోరారు. ఏరియాలోని జివిటిసిలో సోమవారం ఫ్రంట్ లైన్ సూపర్వైజర్స్‌కు నిర్వహించిన స్ట్రక్చర్ ట్రైనింగ్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రమాద రహిత బొగ్గు ఉత్పతి, ఉత్పాదకతను సాధించడమే సింగరేణి సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. సంస్థ మునుగడకు సూపర్వైజర్ల పాత్ర కీలకమని వారు అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని స్ట్రక్చర్ ట్రైనింగ్ కార్యక్రమంలో తమ యొక్క నైపుణ్యాలను మెరుగుపరచుకొని సంస్థ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. శిక్షణ కార్యక్రమాలతో ఉద్యోగుల వృత్తి నైపుణ్యత మెరుగుపడటమే కాకుండా, రక్షణ




పెరుగుతుందని, తద్వారా సంస్థలో బొగ్గు ఉత్పత్తి పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో శిక్షకులు చెప్పే పూర్తి మెలకువలను నేర్చుకొని, సింగరేణి అభివృద్ధికి దోహదపడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూ శంకరయ్య, ఏఐటీయూసీ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, జివిటిసి మేనేజర్ శంకర్, విటిసి శిక్షకులు అశోక్ కుమార్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన టీబీజీకేఎస్ నాయకులు

**బెల్లంపల్లి, జూలై 21 (ప్రభాత సమాచారం)**

టీబీజీకేఎస్ ఇన్చార్జిగా నూతనంగా నియామకమైన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆత్మీయ సమ్మేళనానికి బెల్లంపల్లి నుంచి టీబీజీకేఎస్ నాయకులు హాజరయ్యారు. సోమవారం రాత్రి గోదావరిఖనిలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాస్, వెంకటరమణ, రాజనాల రమేష్ లు పాల్గొన్నారు. కొప్పుల ఈశ్వర్ నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



# మీకు ఏ ఇబ్బంది రాకుండా మేము చూసుకుంటాం

## ఆదివాసీలకు మంత్రి కొండా సురేఖ భరోసా

**ఆదిలాబాద్ ప్రతినిధి, జూలై 21 (ప్రభాత సమాచారం)**

జీవో 49 మీద ఆదివాసీలు, గిరిజనులకు ఎటువంటి ఆందోళన వద్దని.. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అడవి బిడ్డలకు ఎప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భరోసా ఇచ్చారు. ఆదిలాబాద్ ఇంచార్జీ మంత్రి జూపల్లి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమిష్టిగా నిర్ణయం తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదించగా.. ఆయన ఆదేశాల మేరకు సోమవారం జీవో 49ను అబేయన్స్‌లో పెడుతూ అటవీశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జీవో 49 మీద స్థానిక ఆదివాసీల్లో అనుమానాలు, అభ్యంతరాలు నెలకొన్న నేపథ్యంలో వాటిపై పలు దఫాలు మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, సీతక్క భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మంత్రులు సమావేశాలు నిర్వహించి, సమగ్ర వివరాలు సేకరించారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో స్థానిక కలెక్టర్ నుంచి మరొకసారి నివేదిక తెప్పించుకున్న ప్రభుత్వం... ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. పులుల కారిడార్ కవ్వాల్ అభయారణ్యంలో భాగంగా ఉన్న ఆసిఫాబాద్ ప్రాంతాన్ని కుమురంభీం పులుల కన్జర్వేషన్ రిజర్వ్‌గా మారుస్తూ గత నెల 30న అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లలో లక్ష 49 వేల హెక్టార్లను టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జీవో విడుదల కోసం 330 ప్రభావిత గ్రామాల ప్రజల్లో నెలకొన్న అనుమానాలా నివృత్తి చేసేందుకు



అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో మంత్రులు సమగ్ర వివరాలు సేకరించారు. స్థానిక ఆదివాసీల విజ్ఞప్తి మేరకు... సీఎం రేవంత్ రెడ్డికి ఈ విషయాన్ని నివేదించి.. అబేయన్స్‌లో పెట్టాలని ప్రభుత్వం ముందడుగు వేసింది. అయితే, రానున్న రోజుల్లో కూడా ఆదివాసీలకు ఇబ్బందులకు రాకుండా చూసుకుంటామని మంత్రి కొండా సురేఖ హామీనిచ్చారు.





## శిక్షణలోనే తనువు చాలించిన యువ జవాన్

**బజార్‌హత్నూర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన నలువల ఆకాష్ అనే యువకుడు ఆర్మీలో శిక్షణ పొందుతున్న క్రమంలో అకాల మరణం ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టేసింది. 6 నెలల క్రితం ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన ఆకాష్ అస్సాంలో జవాన్‌గా శిక్షణ తీసుకుంటున్నాడు. ఇంత వరకు బాగానే ఉంది. శిక్షణ క్రమంలో భాగంగా ఆదివారం 20 కిలో మీటర్ల రన్నింగ్ చేస్తుండగా ఆకాష్ ఒక్కసారి కుప్ప కూలిపోయాడు. గమనించిన శిక్షణ అధికారులు ఆ యువకుడిని హుటాహుటిన హాస్పిటల్ కు తరలించారు. కానీ అప్పటికి ఆకాష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని శిక్షణా ధికారులు ఆకాష్ కుటుంబానికి సమాచారం అందించారు. యువకుని అకాల మరణంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపొయింది. యువకుని మృతదేహంను ఆయన స్వగ్రామమైన వర్తమన్నూర్ తరలించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆకాష్ మృతితో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి

**కుభీర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

తన కూతురుని హైదరాబాద్‌లో ప్రైవేటు పాఠశాల హాస్టల్‌కు దింపేందుకు బైక్‌పై వెళ్తూ దేగాం వద్ద వంతెనపై నుంచి కిందపడ్డ సంఘటనలో సోమవారం గణేశ్(43) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కుభీర్‌కు చెందిన గణేశ్ ఆర్మీలో పని చేసి రిటైర్డ్ అయ్యారు. భార్య, తన ముగ్గురు పిల్లలతో వ్యవసాయం చేస్తూ కుభీర్‌లోనే ఉంటున్నాడు. తన కూతురు నిఖిల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. హాస్టల్ పంపించేందుకు సోమవారం కుభీర్ నుంచి గణేశ్ ప్రయాణమయ్యాడు. అజంత ఎక్స్‌ప్రెస్‌లో బాసర నుంచి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. బాసర వరకు తన బుల్లెట్ వాహనంపై కూతురును తీసుకుని బయలుదేరాడు. అయితే దేగాం గ్రామం వద్ద 161బీబీ హైవే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పాత వంతెనకు ఆనుకుని మరోవంతెన నిర్మిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న వంతెనకు ముందు రోడ్డు విశాలంగా ఉంది. వేకువ జామున ఈ విషయాన్ని గుర్తించకపోవడం, హైవేపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు, లైట్లు లేకపోవడంతో గణేశ్ నడుపుతున్న వాహనం వంతెనపై నుంచి కింద పడింది. ఈ సంఘటనలో గణేశ్ అక్కడే మృతి చెందాడు. కూతురు నిఖిలకు తీవ్రగాయాలయ్యాయి. నిఖిలను 108 అంబులెన్సులో భైంసాలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. గణేశ్ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు ఆస్పత్రికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు జరుపుతున్నారు.



# విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం

## మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

**మంచిర్యాల, జూలై 21 (ప్రభాత సమాచారం)**

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. పట్టణం లోని సాయికుంటలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా లుగు రోజుల క్రితం ఆశ్రమ పాఠశాలలో పురుగుల అన్నం తినడంతో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారన్నారు. కనీసం తల్లి దండ్రుల కు సమాచారం ఇవ్వకపోవడం ఏంటని పాఠశాల



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్య, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పిల్లల భవిష్యత్తుపై అవగాహన సదస్సు



**నిర్మల్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

"పిల్లల భవిత తల్లిదండ్రుల బాధ్యత" అనే అంశంపైన ప్రముఖ సైకాలజిస్ట్, పేరేంటింగ్ కోచ్ శ్రీ అడ్డిగ శ్రీనివాస్ సోమవారం విజయ హైస్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యాభ్యాసంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అధిక ఒత్తిడిని అధిగమించాలో, విజయానికి ఎలా సులువైన బాటలు చేసుకోవాలో, తల్లిదండ్రులు మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లల ఆలోచన దృక్పథానికి ఎలా స్పందించాలో, వారితో ఎలా మెలగాలో అనే అంశంపై అవగాహన కల్పించారు. పిల్లల పట్ల ఎలాంటి శ్రద్ధ వహించాలో పిల్లలు పాటించవలసినవి, పాటించకూడని విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల జనరల్ సెక్రెటరీ డిస్ట్రిక్ట్ ఒలంపిక్ చైర్మన్ అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ.. పిల్లలు, పోషకులు, సైకాలజిస్ట్ చెప్పినటువంటి మంచి విషయాలను పాటిస్తూ భవిష్యత్తులో మంచి ప్రణాళికలు వేసుకొని ముందుకు సాగాలని, ఉన్నత శిఖరాలకు చేరాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల వైస్ చైర్మన్ అంబా రాణి, ట్రెజరర్ ఆడేపు సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆమెడ కిషన్, పాఠశాల కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ప్రిన్సిపాల్ సామ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు



**కెరమెరి, జూలై 21 (ప్రభాత సమాచారం)**

గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. కెరమెరి మండలంలోని కొఠారిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేయగా ఆసిఫాబాద్ సందీప్ నగర్ కు చెందిన షేక్ రియాజ్. కొఠారి గ్రామానికి చెందిన అడ్డ బిల్లాగీ అదుపులో తీసుకుని 146 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఫొటో వీడియో వెల్ఫేర్ కార్యవర్గం

**మంచిర్యాల, జూలై 21 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా ప్రొఫెషన్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయని ఎలక్షన్ కమిటీ రాష్ట్ర ముఖ్య సలహాదారు కేదార్ రెడ్డి, శ్రీనివాస్ సోమవారం తెలిపారు. జిల్లా అధ్యక్షునిగా అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా పోతనైన తిరుపతి, కోశాధికారిగా శ్రీనివాస్ నియమితులయ్యారు. సభ్యుల సంక్షేమం వారి అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని పేర్కొన్నారు.





## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

**ఆదిలాబాద్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

గ్రంథాలయంలో సరైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసర మైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచేలా తగు చర్యలు కుంటామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తెలిపారు. గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గా నియామకమైన ఆయన లైబ్రె రియన్ సతీష్ చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి అడే గజేందర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య ఎన్జీఓస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, నవీన్‌తో పాటు పలువురు ఆయనకు పుష్పగుచ్ఛలు అందించి శాలువతో సత్కరించారు. పోటీ పరీక్షల అభ్యర్థులతో పాటు పాఠకులకు లైబ్రరీలో సౌకర్యాలు కల్పించేల కృషి చేస్తానని గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. పెండింగ్లో ఉన్న భవన నిర్మాణ పనుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేస్తామన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన మంత్రులతో పాటు నియోజకవర్గ ఇన్చార్జిలు,అభిమానులకు ధన్యవాదలు తెలిపారు.

## ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

**నిర్మల్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ప్రతి నెల 18,500 ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లతో ఆరోగ్య సేవలు చేయించుకుంటున్నప్పటికీ వారి పనికితగ్గ పారితోషకం ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసుకోవాలని వేతనాలు పెంచాలని వేతనాలు చేశారు. కార్యక్రమంలో సుజాత, ఇంద్రమాల ఉన్నారు.



# జివో 49అమలు నిలిపివేత





**సీఎం రేవంత్ రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్**

**ఉట్నూర్, జూలై 21 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం జీవో 49 ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని, ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి జీవోను నిలిపివేసినందుకు ఆదివాసీల పక్షాన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సీఎం రేవంత్ రెడ్డికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నిత్యం ఆదివాసుల కోసం పని చేస్తోందని అన్నారు. ఇటీవల ఉట్నూర్ లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు ఆదివాసులతో సమావేశమై జివో 49ను రద్దు చేస్తామని మాటిచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం నేడు ప్రజా ప్రభుత్వం జీవో 49ను రద్దు చేసిందన్నారు. మరోసారి హైదరాబాద్లో ఫారెస్ట్ అధికారులతో మంత్రులు జూపల్లి కృష్ణారావు ,సీతక్క , సురేఖ సమావేశం నిర్వహించారనీ, జివో రద్దుకు కృషి చేసిన అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ గారికి, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు గారికి, రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విట్టల్, మాజీ ఎంపీ సోయం బాపురావు,ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు తదితరులు ఉన్నారు.

# టైగర్ జోన్‌పై అడవి బిడ్డల విజయం

- ఆదివాసీల ఆందోళనతో దిగొచ్చిన ప్రభుత్వం
- జీవో 49ని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆదివాసీ సంఘాలు,
- సీఎం రేవంత్ రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

కుమరంభీం జిల్లా టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ని సోమవారం నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. పులుల కారిడార్, కవ్వాల్ అభయారణ్యంలో భాగంగా ఉన్న ఆసిఫాబాద్ ప్రాంతాన్ని కుమరంభీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటిస్తూ గతనెల 30 అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆహ్మద్ నదీం జీవో 49 జారీ చేశారు. ఈ జీవో ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కర్జెల్లీ, బెజ్జూరు, పెంచికల్‌పేట రేంజ్‌ల పరిధిలో 1,49,288 హెక్టార్లను టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జీవో విడుదలైన రోజు నుంచి దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ సంఘాలు ఆందోళనలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కుమరంభీం జిల్లా టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ని సోమవారం నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. పులుల కారిడార్, కవ్వాల్ అభయారణ్యంలో భాగంగా ఉన్న ఆసిఫాబాద్ ప్రాంతాన్ని కుమరంభీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటిస్తూ గతనెల 30 అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆహ్మద్ నదీం జీవో 49 జారీ చేశారు. ఈ జీవో ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కర్జెల్లీ, బెజ్జూరు, పెంచికల్‌పేట రేంజ్‌ల పరిధిలో 1,49,288 హెక్టార్లను టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జీవో విడుదలైన రోజు నుంచి దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ సంఘాలు ఆందోళనలు చేపడుతున్నాయి.

జీవో 49పై ఆదివాసీల్లో అనుమానాలు, అభ్యం తరాలు నెలకొన్న నేపథ్యంలో పలుమార్లు మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండ సురేఖ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతిని ధులతో మంత్రులు సమావేశాలు నిర్వహించి పూర్తి వివరాలు సేకరించారు. ఈ పరిణామాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే నుంచి తాజాగా నివేదికలు తెప్పించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం జీవో 49ని నిలుపుదల చేసేందుకు నిర్ణయించి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆహ్మద్ నదీం జీవో 49ని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జీవో 49 రద్దు చేయడం హర్షణీయమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతి నిదులు అన్నారు. జీవో 49 రద్దు చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు, మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కులు జీవో 49 రద్దుకు సహకరించిన మంత్రులు సీతక్క, కృష్ణారావు, కొండ సురేఖ, లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ముఖ్యమంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి సన్మానించారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



# నిర్మల్‌కు మరో మణిహారం

## నిర్మల్ కళ్యాణి జాతీయ రహదారి నాలుగు లైన్ల విస్తరణ కేంద్రం పచ్చ జెండాతో ప్రజల హర్షం

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

చారిత్రాత్మక నగరిగా పేరు ప్రఖ్యాతలు పొందిన నిర్మల్ జిల్లాకు మరో జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం పచ్చ జెండా ఊపింది. నిర్మల్ కళ్యాణి ఎన్ హెచ్ 61 జాతీయ రహదారి విస్తరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నిర్మల్ జిల్లాలో రహదారి అభివృద్ధి పనులు విస్తరణ జరిగే అవకాశం ఉండడంతో నిర్మల్ బైంసా బాసర్ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 15 జాతీయ రహదారుల అభివృద్ధి విస్తరణకు కేంద్ర రహదారుల సంస్థ 33 691 కోట్లను కేటాయించగా అందులో నిర్మల్ కళ్యాణి రహదారి ఉండడంతో ఇక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ పట్టణ కేంద్రంగా ఇప్పటికీ హైదరాబాదు నాగపూర్ జాతీయ రహదారి 64 ఉండగా, నిర్మల్ ఖానాపూర్ జగిత్యాల్ జాతీయ రహదారి విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. దీనికి తోడు నిర్మల్ కళ్యాణి 635 కిలోమీటర్ల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రెండు లైన్లో ఉన్న జాతీయ రహదారిని ఫోర్ లైన్ విస్తరణ రహదారిగా మార్చేందుకు నిధులు కేటాయించాలని ఇటీవలే ఎంపీ నాగేశ్వర్‌తో పాటు ఎమ్మెల్యేలు రామారావు పటేల్ మహేశ్వర్ రెడ్డి పాల్వాయి హరీష్ బాబు తదితరులు కేంద్ర రహదారుల శాఖ మంత్రి గట్కరికి వినతి ప త్రం అందించారు. నిర్మల్ జిల్లా కేంద్రం కావడంతో ప్రస్తుతం పట్టణ జనాభా పెరగడం నిర్మల్ నాగపూర్ జాతీయ రహదారితో పాటు నిర్మల్ జగిత్యాల్ రహదారి ఉండడం బోధన్ బైంసా జాతీయ రహదారి విస్తరణ పనులు జరగడం దీనికి లింకుగా కళ్యాణి ఫోర్ లైన్ నేషనల్ హైవే రోడ్డు పనులకు కేంద్రం సిగ్నల్ ఇవ్వడంతో ప్రజలకు ఎంతో ప్రయోజనంగా ఉంటుంది

**53 కిలోమీటర్ల విస్తరణకు డిపిఆర్...**

నిర్మల్ కళ్యాణి జాతీయ రహదారి అభివృద్ధి లో భాగంగా రెండు లైన్లు ఉన్న రహ దారిని నాలుగు లైన్ల రహదారిగా మార్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రహదారి నిర్మల్ నుండి ప్రారంభమై బైంసా బేల్ తరుడా మీదుగా బోకర్ నాందేడ్ ద్వారా కళ్యాణి వరకు నిర్మించవలసి ఉంటుంది. నిర్మల్ పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా నుండి తానూర్ మండలంలోని బెల్ తెరోడా మహారాష్ట్ర బోర్డర్ వరకు 53 కిలోమీటర్ల రెండు వరసల రాధారిని నాలుగు వరుసల రహదారిగా మార్చేందుకు సమంత డి పి ఆర్ ను రూపొందించాలని కేంద్ర మంత్రి సూచించినట్టు నిర్మల్ బైంసా ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి రామారావు పటేల్ తెలిపారు. ప్రస్తుతం నిర్మల్ నుండి మహారాష్ట్ర బోర్డర్ బేల్ తో రోడ్ వరకు 53 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారి పై చిట్యాల దిలావర్‌పూర్- కల్లూరు- బైంసా- మాటేగావ్- వానల్పాడ్ ఇతర ప్రాంతాల్లో ఇరుకు వంతెనలు ఉండడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతూ ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడుతుంది. రెండు వరసల రహ దారి కావడంతో వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోవడం గాయపడిన వంటి సంఘటనలు జరుగుతు న్నాయి. 10 సంవత్సరాల క్రితం సింగిల్ రహదారిగా ఉన్న ఈ రోడ్డును డబుల్ లైన్ రహదారిగా ఏర్పాటుచేసి టోల్ ప్లాజా వసూలు చేస్తున్నారు. అయితే ఈ రాదారిని ఫోర్ లైన్ గా మార్చితే నిర్మల్ నుండి బైంసా మహారాష్ట్రలోని భోకర్ నాందేడ్ ధర్మాబాద్ బోధన్ ముధోల్ నిజామాబాద్ రహదారులకు అనుబంధంగా ఉండడం వల్ల నిజామాబాద్- నిర్మల్ ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఫోర్ లైన్ విస్తరణ జరిగితే మరింత అభివృద్ధి జరిగి పట్టణం విద్యా వాణిజ వ్యా పార కేంద్రంగా ఎదగడానికి మరింత దోహదపడుతుందని ఈ ప్రాంత ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే లైన్ నిర్మాణం లేకపోవడంతో ఫోర్ లైన్ ఏర్పడితే ట్రాఫిక్ సమస్య ఉండదని వారు భావిస్తున్నారు. అయితే వీలైనం త త్వరగా డిపిఆర్‌ను తయారుచేసి 2028 నాటికి ఫోర్ లైన్ విస్తరణ పనులు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల ప్రజాప్రతినిధులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

